ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

- ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ముందుకు రండి
- ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో నగర సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రోజురోజుకు జఠిలంగా మారుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించాలంటే రోడ్లపై ఉన్న ఆక్రమణలు, ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు అనివార్యమని, అందుకు స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేట్లు, ప్రజా ప్రతినిధులంతా సహకరించాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించడంలో భాగంగా నిర్వహించ తలపెట్టిన రోప్ (రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు)పై ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు, ఇతర శాఖల అధికారులతో పాతబస్తీ పురానీ హవేలీలోని పాత కమిషనరేట్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సమన్వయ సమావేశానికి సీపీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సీపీ ఆనంద్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ప్రతిరోజు 88లక్షల వాహనాలు రోడ్లపై ప్రయాణిస్తున్నాయని, ప్రతిరోజు 1500కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఇప్పటికే పోలీసులు పలు రకాల చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అయితే చాలా చోట్ల నగర రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడం, క్యారేజీ మార్గాల్లో, ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారని, దీని వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నట్టు సీపీ వివరించారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించాలంటే ఆక్రమణలను తొలగించడం అనివార్యమని పేర్కొన్నారు. దీని కోసం ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులందరూ సహకరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్, బలాల, మాజిద్ హుస్సేన్, కౌసర్ మోయినుద్దీన్, జాఫర్ హుస్సేన్, మహ్మద్ ముబీన్, స్థానిక కార్పొరేటర్లతో పాటు ట్రాఫిక్ అదనపు కమిషనర్ పి.విశ్వప్రసాద్, ట్రాఫిక్-3 డీసీపీ వెంకటేశ్వర్లు, సౌత్ జోన్ డీసీపీ స్నేహా మెహ్రా, సౌత్‌ఈస్ట్ జోన్ పాటిల్ కాంతిలాల్ సుభాష్, జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులతో సమావేశమైన నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

తాను మరణిస్తూ.. ఐదుగురికి కొత్త జీవితం

బైరు అంజమ్మ (ఫైల్)

ఖైరతాబాద్, డిసెంబర్ 4: తాను మరణిస్తూ ఐదుగురికి కొత్త జీవితాన్నందించారు నల్గొండ జిల్లా చౌటుప్పల్ మండలం, తంగడుపల్లె గ్రామానికి చెందిన బైరు అంజమ్మ (68). జీవన్‌దాన్ నోడల్ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 28న అంజమ్మ ఆకస్మాత్తుగా ఇంట్లో అపస్మారక స్థితిలో పడిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, ఈనెల 3న బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. ఆమె శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, కార్నియాలను సేకరించారు.

సీఎం కప్-2024 క్రీడాపోటీలకు దరఖాస్తులు

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 4: సీఎం కప్-2024 పేరు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు WWW.CMCUP2024.GOV.IN పోర్టల్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకనటలో తెలిపారు. గ్రామ స్థాయిలో ఈనెల 7, 8వ తేదీల్లో, మండల, మున్సిపాలిటీ స్థాయిలో ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు, రాష్ట్రస్థాయిలో ఈనెల 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు పోటీలు ఉంటాయని అన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం లేదా 10వ తరగతి మేమో, ఫొటో, ఆధార్ కార్డను తప్పని సరిగా సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు.

ఓయూలో పార్ట్‌టైం లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: ఓయూ కళాశాలలోని హిస్టరీ విభాగంలో పార్ట్‌టైం లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ హిస్టరీ కోర్సును బోధించేందుకు అర్హులైన వ్యక్తులను దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. హిస్టరీ సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పూర్తి చేయడంతో పాటు నెట్, సెట్‌లో అర్హత సాధించడం లేదా పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 7వతేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడతామని స్పష్టం చేశారు.

చల్లా సుబ్బారాయుడుకు ఘంటసాల బిరుదు

సుబ్బారాయుడును సత్కరిస్తున్న రమణాచారి

రవీంద్రభారతి, డిసెంబర్ 4: ఘంటసాల గాన పరిశోధకుడు చల్లా సుబ్బారాయుడుకు ఘంటసాల గాన పరిజ్ఞాన విశారద బిరుదు ప్రదానోత్సవం బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పూర్వ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగమం ఫౌండేషన్ నిర్వహణలో అమరగాయకుడు పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు 102 జయంతి సందర్భంగా అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ ఘంటసాల పాట ఉన్నంత వరకు ఘంటసాల పాటలు స్థిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఘంటసాల స్వర్గం చెలవేరులాంటిందని, ఎంతో మందికి గాయకులకు ఆయన స్ఫూర్తి అని కొనియాడారు. సూర్య చంద్రులు ఉన్నంత వరకు ఆయన మధుర గీతాలు ఉంటాయన్నారు. సభకు ముందు పలువురు గాయకులు ఆలపించిన మధుర గీతాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో సంగం ఫౌండేషన్ అధ్యక్షుడు సంజయ్‌కిశోర్, పద్మశ్రీ శోభా రాజు, రేలంగి నరసింహారావు, కేఎం రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వినతిపత్రం ఇస్తున్న పి.నారాయణ, రాంబాబుయాదవ్, తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 4: హెచ్ఎండబ్ల్యూ, ఎస్‌బీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో వాటర్ వర్క్స్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాల పెంపు, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురు నాయకులు బుధవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులు అనేక ఏండ్లుగా తక్కువ వేతనాలతో తీవ్ర అర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం రూ.13,500 మాత్రమే వేతనం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తమ కోరిక మేరకు జీవో 60/2021 సాధించుకున్నామని, తద్వారా కొంత మేరకు వేతనాలు పెరిగాయన్నారు. అధికారుల తప్పిదం వల్ల అమలు ప్రక్రియ కేటగిరి-2లో చేర్చాల్సిన కార్మికులను, కేటగిరి-1లో చేర్చారన్నారు. ఇందువల్ల కార్మికులకు ప్రతినెల దాదాపు రూ.4వేలు తక్కువ వేతనం వస్తుందని వివరించారు. కార్మికులకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్సీని కోరారు. బీఆర్‌టీయూ నాయకుడు రూప్‌సింగ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, కుమార్, జగన్, రమేశ్, వీరాస్వామి, సురేశ్, రాములు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాసరావు

నార్మ్ డైరెక్టర్‌కు రెండు అవార్డులు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 4: సాయిల్స్ సెన్సెస్ తోపాటు ఆర్గానో మినరల్స్ ఫర్టిలైజర్స్ అంశాలపై పరిశోధల నిమిత్తం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఐసీఏఆర్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఐసీఏఆర్-నార్మ్) డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావుకు అవార్డులు అందజేశాయి. సాయిల్ సైన్సెస్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు కోరమాండల్ ప్లాంట్ న్యూట్రీషియన్ అవార్డును అసోషియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సెమినార్‌లో బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రి అనుప్రియ పటేల్ నుంచి అందుకున్నారు. ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫర్టిలైజర్స్ ఏప్రిల్ సంచికలో ప్రచురించిన భారత్‌లో సుస్థిర వ్యవసాయం, వాతావరణ చర్య, ఆర్గానోమినరల్ ఫర్టిలైజర్ తన పరిశోధనా పత్రానికి వ్యవసాయ శాస్త్రవేత్త మొరార్జీ మెమోరియల్ అవార్డును కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్మ్ సంస్థ శాస్త్రవేత్తలు, అధికారులు తమకెంతో సహకరించారని గుర్తుచేశారు.

కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, తదితరులు

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 4. ఆశాలకు లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులను చెల్లించిన తర్వాతే నూతన సర్వే చేయించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోఠిలోని రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కమిషనర్ ఆర్‌వీ కర్ణణ్‌కు ఆమె వినతి ప్రతం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతే సర్వే చేయించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లెప్రసీ సర్వే చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఆపేయాలని అన్నారు. నేటికి ఆశాలకు పెండింగ్‌లో ఉన్న డబ్బులు చెల్లించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. వారంలో డబ్బులు అందేవిధంగా ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారని పేర్కొన్నారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీలో లెప్రసీ సర్వేపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.యాదమ్మ, నాయకురాలు మీన, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, నగర సెంట్రల్ ప్రధాన కార్యదర్శి అనిత, సెంట్రల్ జాయింట్ సెక్రటరీ డి.భాగ్యలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

మహిళల స్థితిగతులు మెరుగవ్వాలి

మాదాపూర్, డిసెంబర్ 4: మహిళా దక్షత సమితి (ఎండీఎస్) గ్రామీణ, ఆర్థికంగా వెనకబడిన నేపథ్యం నుంచి వచ్చిన బాలకల జీవితాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. చందానగర్ సుమన్ కళాశాలలోని సంస్థను బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ విద్య, సమగ్రాభివృద్ధి ద్వారా వారికి ఎండీఎస్ సాధికారత కల్పిస్తోందని అన్నారు. డాక్టర్ సరోజ్ బజాజ్ నేతృత్వంలో అనాథలు, ఒంటరి తల్లిదండ్రుల కుమార్తెలు, దినసరి వేతన జీవుల పిల్లలకు అవకాశాలు కల్పిస్తూ దశాబ్దాలుగా సేవలందించడం అభినందనీయమని అన్నారు. మహిళల స్థితిగతుల మెరుగుదలపైనే ప్రపంచ సంక్షేమం ఆధారపడి ఉంటుందని స్వామి వివేకానంద దార్శనికతకు అనుగుణంగా సాగుతున్నట్లు చెప్పారు. యువత తమ కలలను నెరవేర్చుకోవడంలో నిర్మలా గోయెంకా గల్స్ హాస్టల్ ఎంతగానో సాయం చేస్తుందన్నారు. ఇంట్లో ఒక మహిళను చదివిస్తే కుటుంబం మొత్తాన్ని చదివించినట్లేనని మహాత్మా గాంధీ చెప్పాడని, ఎండీఎస్ ఈ వాస్తవాన్ని పాటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులు ఐదుగురిని ఎంపిక చేసి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏఎన్ఎం పోస్టుల సంఖ్య పెంచాలి

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 4: ఏఎన్ఎంల పరీక్షకు సంబంధించి ప్రస్తుతం ఉన్న 1931 పోస్టులకు అదనంగా పోస్టులు పెంచడంతో పాటు వయసు మీరిన వారికి వంద శాతం గ్రాఫ్ శాలరీతో పాటు పది లక్షల లైఫ్ టైం గ్రాట్యుటీ ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోఠిలో రెండో ఏఎన్ఎంల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన కమిటీ చైర్మన్ హైమావతి, కమిటీ సభ్యులు రవీందర్‌నాయక్‌కు కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ 18 ఏండ్లుగా ఎన్హెచ్ఎంలో అతితక్కువ వేతనంతో పని చేస్తున్న వీరి సేవలను ప్రభుత్వం గుర్తించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కరోనా కష్ట కాలంలో ప్రజలకు సేవలందించడంలో రెండో ఏఎన్ఎంల పాత్ర ఎనలేనిదని గుర్తుచేశారు. ఆర్థిక సుడిగుండంలో జీవితాన్ని నెట్టుకు వస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిటీ సభ్యులు రెండో ఏఎన్ఎంల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండో ఏఎన్ఎంల సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర కోశాధికారి రాజేశ్వరి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ, రెండో ఏఎన్ఎం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

డిసేబుల్డ్ అవేర్‌నెస్ వాక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి, కొబ్లి నాగేశ్వరరావు తదితరులు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 4: వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం పెరిగేల స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు సహకరించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి ఆకాంక్షించారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 6న నెక్లస్ రోడ్డు ఇందిరాగాంధీ విగ్రహం నుంచి పీపుల్స్ ప్లాజా వరకు వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న అవగాహన నడక పోస్టర్ ఆవిష్కరణ రమణాచారి కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులను చైతన్యం చేయడం కోసం చేపట్టిన వికలాంగుల అవేర్నెస్ వాక్-2024ను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహరించాలని కోరారు. వేదిక అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ వికలాంగుల పట్ల సమాజం చూపవలసింది సానుభూతి కాదు సహకారం, ప్రోత్సాహం, సమాన అవకాశాలని పేర్కొన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా 12వ సారి జరుగుతున్న కార్యక్రమంలో నగర శివారు నుంచి పెద్ద సంఖ్యలో వికలాంగులు, సకలాంగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 6న ఉదయం 8గంటలకు మండలి చైర్మన్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల వేదిక సలహాదారు వీఆర్ శ్రీనివాస్, సభ్యులు కె.సుబ్బారావు, పి.శ్రీనివాస్, కార్తిక్ పాల్గొన్నారు.

జనవరి నుంచి హైడ్రా గ్రీవెన్స్

ప్రతి సోమవారం ఫిర్యాదుల స్వీకరణ ■ హైడ్రా పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రయత్నం

సిటీబ్యూరో, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ): రోజుకొక సంచలనాత్మక నిర్ణయంతో హైడ్రా హడావిడి చేస్తోంది. ఔటర్‌రింగ్ రోడ్డు లోపల హైదరాబాద్‌లో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై దృష్టిపెట్టిన హైడ్రా ఇకపై ప్రజల నుంచి నేరుగా ఆక్రమణలపై ఫిర్యాదులు స్వీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తమ అధికారులతో చర్చించారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లలో గ్రీవెన్స్ మాదిరి హైడ్రా కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటే బాగుంటుందని అధికారులు సూచించడంతో ప్రభుత్వానికి ఇందుకు సంబంధించిన నివేదిక పంపించారు. సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో కొత్త సంవత్సరం జనవరి నుంచి ప్రతీ సోమవారం హైడ్రా కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో గత 40 ఏళ్లలో 45 శాతం చెరువులు కబ్జాకు గురయ్యాయని, ఉన్న చెరువులను కాపాడుకోవడంతో పాటు హైదరాబాద్‌ను వరద ముప్పు నుంచి తప్పించాలంటే నాలాల ఆక్రమణలపై కూడా దృష్టిపెట్టాలని కమిషనర్ రంగనాథ్ చెబుతున్నారు. ఫిర్యాదులపై సమగ్రంగా విచారణ జరిపి క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి బృందాల వారీగా పని చేస్తున్నప్పటికీ పోలీస్‌స్టేషన్ కూడా ఏర్పాటు చేస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందన్న భావన కలుగుతుందని కమిషనర్ అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ప్రభుత్వానికి హైడ్రా ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు నివేదిక కూడా ఇచ్చినట్లు తెలిసింది. హైడ్రా కార్యాలయంలోనే పీఎస్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాల్లో హైడ్రాపై చర్చించనున్న నేపథ్యంలో తమ కూల్చివేతలు, చెరువుల సుందరీకరణకు సంబంధించిన రిపోర్ట్ తయారు చేస్తున్నట్లు తెలిసింది.

కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌లో వర్చువల్ వైల్డ్‌లైఫ్ సఫారీ కేంద్రం, ఏకో టూరిజం వృక్ష పరిచయ కేంద్రాలను మంత్రి కొండా సురేఖతో కలిసి ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

బొటానికల్ గార్డెన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

- నగరంలో 14 వనాలు కేటాయింపు

శేరిలింగంపల్లి, డిసెంబర్ 4: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో కొత్తగూడలోని కొట్ల విజయభాస్కర్‌రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో సీఎం ఏ రేవంత్‌రెడ్డి బుధవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గార్డెన్‌లో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ కేంద్రం, ఏకో టూరిజం, వృక్ష పరిచయ కేంద్రాలను అటవీ శాఖ మంత్రి కొండాసురేఖతో కలిసి ప్రారంభించారు. రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త గూడెం,పాల్వంచ, సత్తుపల్లి డివిజన్ మేనేజర్ కార్యాలయ కాంప్లెక్సులను బాటానికల్ గార్డెన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. బొటానికల్ గార్డెన్‌లో నిర్మించనున్న తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్యాలయ భవన నిర్మానానికి ఆయన శంకుస్థాపన చేశారు. టీజీఎఫ్‌డీసీ అధ్వర్యంలో అందుబాటులోకి తీసుకువచ్చిన 8 నూతన వాహనాలను, బ్యాటరీ కార్లను ప్రారంభించారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ టీజీఎఫ్‌డీసీ ఎల్ దేశంలోనే శాశ్వత అటవీ యాజమాన్య, ఏకో టూరిజం రంగంలో అగ్రగామిగా ఎదిగిందన్నారు. జులై 2024లో 32,951 హెక్టార్ల ప్రాంతానికి అంతర్జాతీయ ట్రేడ్ సర్టిఫికేట్ ఎఫ్ఎస్‌సీ ఎఫ్ఎం, సీఓసీలను సొంతం చేసుకుందన్నారు. గత సంవత్సర కాలంలో టీజీఎఫ్‌డీసీఎల్ నిఖరలాభం 100 శాతం పెరిగిందన్నారు. ప్లాంటేషన్ నిర్వాహణ కోసం 8 కొత్త వాహనాలను కొనుగోలు చేశామని, ప్రభుత్వ అనుమతి మేరకు 53 మంది కొత్త సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. ముచ్చర్ల ఫారెస్టు క్లస్టర్‌లో 15 వేల ఎకరాల్లో ఎకోటూరిజం, ఎకో విలేజ్ ప్రణాళికను సిద్ధం చేశామని, నూతన ఎకోటూరిజం ఫాలసీ అనుమతి కోసం చూస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ నగర వనం యోజన పథకం ద్వారా తెలంగాణకు 14 వనాలు కేటాయించారని, వీటి అభివృద్ధి కోసం 18వేల కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో 12 ప్రాంతాలను ఎకోటూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, వైరా ఎమ్మెల్యే రాములునాయక్, టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ పొదెం వీరయ్య, ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ప్రముఖులు పాల్గొన్నారు.